# స్వల్ప తేడా మాత్రమే

- ఎనిమిది మండలాల్లో తనదైన శైలిలో బీఆర్ఎస్‌కు ఓట్లు
- జన్నారం, ఉట్నూర్, దస్తురాబాద్‌లో తగ్గిన ఓట్లు
- మిగిలిన మండలాల్లో బీఆర్ఎస్ పోటాపోటీ



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ప్రజలు (ఫైల్)

కడెం, డిసెంబర్ 5: శాసనసభ ఎన్నికల ఫలితాల్లో అయా మండలాల్లోని బూత్‌ల వారీగా ప్రధాన పార్టీలు సాధించిన మెజార్టీ కంటే నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో బీఆర్ఎస్ తనదైన శైలిలో ఓట్లు సాధించింది. ప్రతి మండలంలో పోటాపోటీగా నువ్వా, నేనా అనే చందంగా బీఆర్ఎస్ పోటీ ఇచ్చింది. కొన్ని మండలాల్లో కాంగ్రెస్‌తో పోటీ పడితే, మరికొన్ని మండలాల్లో బీజేపీతో పోటీ పడింది. అయితే అనేక బూత్‌ల్లో కాంగ్రెస్, బీజేపీకి సింగిల్ డిజిట్ వచ్చినప్పటికీ బీఆర్ఎస్ మాత్రం ఆ పరిస్థితిని ఎందులో కూడా తెచ్చుకోలేదు. కానీ ప్రధానంగా జన్నారం, ఉట్నూర్, దస్తురాబాద్ మండలాల్లో బీఆర్ఎస్‌కు కొంత ఓట్ల శాతం తగ్గింది. దస్తురాబాద్‌లో బీజేపీ లీడ్ సాధించగా, బీఆర్ఎస్ ద్వితీయ స్థానంలో సాధించింది. అలాగే జన్నారం, ఉట్నూర్‌లో బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్, బీజేపీలు ఓట్లు సాధించాయి. కాగా, మొత్తం నియోజకవర్గంలో ఎనిమిది మండలాల పరిధిలో 305 బూత్‌లుండగా, మండలాల వారీగా ఇలా ఉన్నాయి.

**మండలాల వారీగా బూత్‌లు**

ఎనిమిది మండలాల పరిధిలో మొత్తం 305 బూత్‌లున్నాయి. ఇందులో ఇంద్రవెల్లి 42 బూత్‌లు, సిరికొండ 10, ఉట్నూర్ 73, దస్తురాబాద్ 20, కడెం 36, పెంబి 20, ఖానాపూర్ 50, జన్నారం 54 ఉన్నాయి.

**పోలైన ఓట్లు, ఓటింగ్ శాతం**

1. దస్తురాబాద్ – 12705, 81.33 శాతం
2. ఇంద్రవెల్లి – 24801, 80.28 శాతం
3. జన్నారం – 32462, 75.09
4. కడెం – 22424, 79.30
5. ఖానాపూర్ – 30423, 75.53
6. పెంబి – 8317, 79.00
7. సిరికొండ – 5085, 88.51
8. ఉట్నూర్ – 36970, 75.66

మొత్తం 170815, 75.66

**ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు, ఓటింగ్ శాతం**
**బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్**

1. దస్తురాబాద్ – 3194, 4134, 2482.
2. ఇంద్రవెల్లి – 8100, 4874, 10457.
3. జన్నారం – 9592, 10083, 11290.
4. కడెం – 7209, 6320, 7769.
5. ఖానాపూర్ – 10915, 11738, 6807.
6. పెంబి – 2867, 2414, 2975.
7. సిరికొండ – 1792, 619, 2325.
8. ఉట్నూర్ – 10071, 11336, 13699

మొత్తం – 53921, 51518, 58210.

**లోపాలను సరిదిద్దుకుంటాం**

నియోజకవర్గంలోని అయా మండలాల పరిధిలో కొన్ని బూత్‌ల్లో తగ్గిన ఓట్ల అంశంపై త్వరలోనే పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తాం. లోపాలను సరిదిద్దుకొని పార్టీని మరింత బలోపేతం చేస్తాం. ఓటమితో కుంగిపోం. ఈ ఓటమిని గుణపాఠంగా తీసుకొని పదేళ్లకాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తాం. కొన్ని పోలింగ్ బూత్‌ల్లో తగ్గిన ఓట్ల సరళిని సమీక్షించుకుంటాం. ఓట్లు తగ్గిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తకు కృతజ్ఞతలు.

**– బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్**

# బాధిత కుటుంబానికి పరామర్శ



క్రిష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్, డిసెంబర్ 5 : బీఆర్ఎస్వీ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరల మహేందర్ చెల్లెలు మృతి చెందగా మంగళవారం మండలంలోని రాజుల్‌గూడ గ్రామంలో పెద్దకర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ హాజరయ్యారు. క్రిష్ణవేణి చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబానికి భరోసా ఇచ్చారు. వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తోడసం నాగోరావ్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, డైరెక్టర్ దుర్గే కాంతారావ్, సర్పంచ్‌లు రాథోడ్ సావిందర్, రాథోడ్ విష్ణు, యుర్వేత రూప్‌దేవ్, కోఆప్షన్ సభ్యుడు షేక్ దస్తగిరి,నాయకులు రాథోడ్ రమేశ్, ఫిరోజ్‌ఖాన్, నర్సింగ్‌మోరే, అశోక్, సుభాష్, మహేందర్, సంజీవ్‌నాయక్, బాలాజీ,దత్తా, దిగంబర్, దాదే అలీ, ఆయా సంఘాల నాయకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

# నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం

భైంసా, డిసెంబర్ 5 : భైంసా ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ అమృత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959226005 కు సంప్రదించాలని పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా పలు సూచనలు, సలహాలు అందించాలని సూచించారు.

# వరి కొయ్యలను కాల్చొద్దు



వరి కొయ్యలపై అవగాహన కల్పిస్తున్న ఏఈవో అంబాజీ

సోన్, డిసెంబర్ 5 : వరి పంటను సాగు చేసిన రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని ఏఈవో అంబాజీ పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా సోన్ మండలంలోని వివిధ గ్రామాల్లో వరి సాగు చేసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి కొయ్యలను కాల్చడం వల్ల నేల స్వభావాన్ని కోల్పోతుందని రైతులకు వివరించారు. నేల భూసారాన్ని పరిరక్షించుకునేందుకు సేంద్రియ ఎరువులను ఎక్కువగా వినియోగించి రసాయన ఎరువులను తక్కువగా వాడాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీం ఎస్ఐ సుమాంజలి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం నిర్మల్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు షీటీం సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై దాడులు, ఈవ్‌టీజింగ్‌లు జరిగితే వెంటనే కళాశాల ప్రిన్సిపాల్‌కు గానీ డయల్ 100 కు సమాచారం అందించాలన్నారు. విద్యార్థులకు వుమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, షీటీంను ఎలా సంప్రదించాలి, బాల్య వివాహాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. షీటీం సభ్యులు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్ : ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి



కడెం : తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈవో సురేశ్

# రైతులు అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్,డిసెంబర్ 5 : వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ప్రత్యేక అధి కారి రాజేశ్వర్ గౌడ్ సూచించారు. మంగళవారం ఆకొండపేట, దస్తురాబాద్, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, అభివృద్ధి పనులను పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వహకులకు సూచించారు. నర్సరీలను పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పల్లె ప్రకృతి వనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎంపీడీవో విజయ్ భాస్కర్ రెడ్డి, ఎంపీవో అనిల్ కుమార్, ఏపీఎం గంగాధర్, హెచ్ఎంలు కోట వేణు, శిరీష, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది.కాగా వరి కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం కుప్పలపై కవర్లను కప్పే పనిలో నిమగ్నం అయ్యారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన**

కడెం, డిసెంబర్ 5 : మండలంలోని నవాబుపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో కడెం క్లస్టర్ ఏఈవో సురేశ్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు వరిధాన్యాన్ని కాపాడుకోవాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకొని సూచించారు. వరిధాన్యంలో తప్ప, తాలు లేకుండా చూడాలని, తేమశాతం చూసి వేగంగా కొనుగోలు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు.

# రైతులకు రెయిన్ పైపుల అందజేత



రెయిన్ పైప్‌లను అందిస్తున్న రిలయన్స్ ఫౌండేషన్ అధికారి రాజేందర్‌రెడ్డి

తానూర్, డిసెంబర్ 5 : ఝరి(బీ) గ్రామానికి చెందిన రైతులకు రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా అధికారి రాజేందర్‌రెడ్డి రెయిన్ పైపులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝరి(బీ), మొగిలి గ్రామాలను మోడల్ గ్రామాలుగా తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవేందర్ నాయక్, సీఆర్డీ సంస్థ ప్రతినిధి కాసా దత్తు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆస్తి పన్నును వెంటనే చెల్లించాలి

**– మున్సిపల్ రెవెన్యూ అధికారి గంగాధర్**

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 5 : నిర్మల్‌లో ప్రజలు తమ ఆస్తి పన్నును నిర్ణీత తేదీల్లో వెంటనే చెల్లించాలని నిర్మల్ మున్సిపల్ రెవెన్యూ అధికారి గంగాధర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో ఆస్తి పన్ను వసూలును పకడ్బందీగా చేపడుతున్నామని చెప్పారు. పన్ను బకాయిలపై ఎలాంటి వడ్డీ మాఫీ లేదని, ప్రతీ ఏడాది మాదిరిగానే మార్చి 31 వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని సకాలంలో పన్నులు చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని పేర్కొన్నారు.